సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం : 31 : జనవరి : 2024



వారి చేతిలో పండు భద్రం

ఢిల్లీ దోసకాయల కోత, ప్యాకింగ్ చేయడంలో బెళుగుప్ప మండలం కాలువపల్లి కూలీలు నిష్ణాతులుగా పేరు గాంచారు. 8లో



టమాట కిలో రూ.16

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.16 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి వాతావరణం కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

పలు రైళ్ల పునరుద్ధరణ



టన్నల్‌లో ట్రయల్ రన్ చేస్తున్న రైల్వే అధికారులు

పుట్టపర్తి టౌన్: ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్– కొత్తచెరువు మధ్య ఉన్న రైల్వే టన్నెల్ మరమ్మత్తుల కారణంగా రద్దు చేసిన పలు రైళ్లను బుధవారం నుంచి పునరుద్ధరిస్తున్నట్లు ప్రశాంతి నిలయం స్టేషన్ మేనేజర్ సతీష్‌రెడ్డి తెలిపారు. 63 రోజుల అనంతరం జనవరి 31 నుంచి ప్రశాంతి, ఉద్యాన్, రాజధాని, బసవ, కర్ణాటక, ఎక్స్‌ప్రెస్‌లు గతంలో నడుస్తున్న సమయంలోనే యథావిధిగా ఈ మార్గంగుండా నడుస్తాయని వెల్లడించారు. పెనుకొండ సమీపంలో ఉన్న రైల్వేట్రాక్ మరమ్మత్తుల కారణంగా మిగిలిన రైళ్లు ఫిబ్రవరి 8 నుంచి తిరిగి పునరుద్ధరిస్తామని తెలిపారు.

ఎంపీడీఓలను తక్షణం రిలీవ్ చేయండి

- కలెక్టర్ గౌతమి ఆదేశం

అనంతపురం సిటీ: ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఎంపీడీఓలను తక్షణం రిలీవ్ చేయాలని అనంతపురం కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. ఈ మేరకు జెడ్పీ సీఈఓ వైఖోమ్ నదియాదేవి సహా మండల పరిషత్ అధికారులను ఆదేశిస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సొంత జిల్లాతో పాటు మూడేళ్లు ఒకే జిల్లాలో పని చేసిన ఎంపీడీఓలందరినీ బదిలీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిందన్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో 38 మంది ఎంపీడీఓలను ఇతర జిల్లాలకు బదిలీ చేసినట్లు వెల్లడించారు. వీరిలో వైఎస్సార్ జిల్లాకు 15 మంది, కర్నూలు జిల్లాకు 23 మంది బదిలీ అయ్యారని, వీరందరినీ తక్షణం రిలీవ్ చేయాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు. బదిలీ అయిన ఎంపీడీఓలు ఆలస్యం కాకుండా పాలనాధికారుల(ఏఓలు)కు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఏఓలు లేని మండలాల్లో ఈఓపీఆర్‌డీలకు బాధ్యతలు అప్పగించి తప్పుకోవాలని పేర్కొన్నారు.

- వైఎస్సార్ జిల్లాకు బదిలీ అయిన ఎంపీడీఓలలో కె.జ్యోత్స్న, జీఎస్ రామచంద్ర, ఎస్.షకీలాబాను, బి.విజయభాస్కర్, ఎస్.నరసింహమూర్తి, పీడీ శ్రీనివాసులు, జి.లక్ష్మీనరసింహ, డి.ప్రభాకర్, బి.రామకృష్ణ, పి.కుళ్లాయిస్వామి, టి.యోగానందరెడ్డి, బి.నిర్మలకుమారి, ఎ.వెంకటరంగారావు, పి.దివాకర్, జె.సాల్మన్ ఉన్నారు.
- కర్నూలు జిల్లాకు బదిలీ అయిన వారిలో బి.శకుంతల, వి.సరస్వతి, బి.విజయలక్ష్మి, ఎస్.గంగావతి, సీఎల్ సోనీబాయి, ఎం.కొండన్న, కేవీ కవిరాజ్, ఎ.వి.శ్రీనివాసులు, టి.లక్ష్మీనారాయణ, బీవీ రవిప్రసాద్, జి.మునెప్ప, ఎస్.సాయిమనోహర్, కేఎస్ నరేష్‌కృష్ణ, డి.రామారావు, పి.నరేంద్రకుమార్, టి.అలివేలమ్మ, ఎస్.బారాన్ సాహెబ్, ఎం.నరసింహనాయుడు, ఎస్.శివశంకరప్ప, డి.రాబర్ట్ విల్సన్, కె.ఆజాద్, బి.కిరణ్‌మోహన్ రావు, ఎస్.రఘునాథగుప్తా ఉన్నారు.

జెడ్పీ పరిధిలో పదోన్నతులకు పచ్చజెండా

- 46 మంది అటెండర్లకు రికార్డు, ల్యాబ్ అసిస్టెంట్లుగా అవకాశం



అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ పరిధిలో పదోన్నతులకు లైన్ క్లియర్ అయ్యింది. ప్రమోషన్ల కోసం సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న జెడ్పీ సహా ఉన్నత పాఠశాలలు, అనుబంధ శాఖల (పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్) అటెండర్ల కల సాకారమయ్యే సమయం దగ్గర పడింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ చొరవతో వీరి పదోన్నతులకు మోక్షం లభించింది. జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా దేవి సూచనల మేరకు డిప్యూటీ సీఈఓ లలిత బాయి, ఏ సెక్షన్ అధికారులు పదోన్నతులకు సంబంధించిన ప్యానల్ లిస్ట్ సిద్ధం చేశారు. ఆ తరువాత ఎంతమంది అర్హత ఉన్నారు, ఎన్ని పోస్టులు భర్తీ చేయవచ్చో సమగ్ర నివేదిక రూపొందించారు. రోస్టర్ కూడా పరిగణనలోకి తీసుకున్నారు. జాబితా సిద్ధం కాగా, జెడ్పీ చైర్‌పర్సన్ ఆమోదం కోసం ఫైల్ పంపారు. ఆమె గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో మొత్తం 46 మంది అటెండర్లకు రికార్డు, ల్యాబ్ అసిస్టెంట్లుగా పదోన్నతులతో పాటు స్థానాలు కూడా కేటాయించనున్నారు. ఈ ప్రక్రియ మొత్తం రెండు మూడో రోజుల్లో పూర్తి కానున్నట్లు జెడ్పీ వర్గాలు తెలిపాయి.

పడతే పట్టపురాణి



- మహిళల పేరుతోనే జగనన్న ఇళ్లు
- పక్కాగా రిజిస్ట్రేషన్లు చేసి హక్కు కల్పిస్తున్న ప్రభుత్వం
- ఫిబ్రవరి 9వతేదీ లోపు పూర్తి చేసేందుకు కసరత్తు

హిందూపురం అర్బన్: అతివల ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేస్తున్న వైఎస్ జగన్ సర్కార్.. పడతిని 'పట్ట'పు రాణిని చేస్తోంది. తలదాచుకునే నీడ కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న నిరుపేదలకు 'నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా ఊళ్లకు ఊళ్లే నిర్మిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే లబ్ధిదారులైన మహిళలకు పట్టాలు మంజూరు చేసింది. వాటిపై పూర్తి హక్కులు కల్పిస్తూ మహిళల పేరిట రిజిస్ట్రేషన్ చేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు అనుగుణంగా జిల్లాలో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఫిబ్రవరి 9వ తేదీ లోపు ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు.

గత ప్రభుత్వాలకు భిన్నంగా..

గత ప్రభుత్వాలు పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చినా పక్కాగా రిజిస్ట్రేషన్ చేసిన దాఖలాలు లేవు. గతంలో డీ పట్టాలు ఇవ్వడంతో వాటిపై పేదలకు ఎలాంటి హక్కులు ఉండేవి కావు. ఈ క్రమంలో అత్యవసరంలోనూ వాటి వల్ల ఎలాంటి ఉపయోగం ఉండేది కాదు. కానీ జగన్ సర్కార్ మహిళలకు సర్వహక్కులతో పట్టాలు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తోంది.

లక్షల విలువచేసే స్థలాలు రిజిస్ట్రేషన్..

ఇంతవరకు తమ పేరిట సెంటు స్థలం లేదని ఆవేదన చెందుతున్న పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని మహిళలు... ప్రభుత్వ నిర్ణయంతో లక్షాధికారులవుతున్నారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్ నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు ఇల్లు సైతం కట్టిస్తున్నారు. స్థలాలు కూడా పట్టణ సమీపంలో ఇచ్చారు. ప్రభుత్వం స్థలాలు మంజూరు చేసిన వివిధ ప్రాంతాల్లో మార్కెట్ రేటు పరిశీలిస్తే సెంటు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల దాకా పలుకుతోంది. దీంతో లబ్ధిదారుల్లో ఆనందం నెలకొనగా, వారి సంతోషాన్ని రెట్టింపు చేస్తూ పైసా ఖర్చు లేకుండా ఆ ఇంటిని రిజిస్ట్రేషన్ చేసి పూర్తి హక్కులు కల్పిస్తున్నారు.

సచివాలయాల్లోనే ప్రక్రియ..

'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' పథకం కింద స్థలాలు, ఇళ్లు పొందిన మహిళలకు వాటిని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియ జిల్లాలో ప్రారంభం కానుంది. లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా గ్రామ/వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసి అర్హులకు కన్వేనియన్స్ డీడ్స్ ఇవ్వనున్నారు. ఇందుకోసం పంచాయతీ కార్యదర్శులకు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ హోదా కల్పిస్తూ ఇటీవలే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కాలనీల్లో సౌకర్యాలు

జిల్లా వ్యాప్తంగా ఉన్న జగనన్న కాలనీల్లో తాత్కాలిక నీటి వసతి కోసం మొత్తం రూ.183 కోట్లు కేటాయించారు. ఇప్పటికే రూ.17.97 కోట్లు ఖర్చు చేశారు. అలాగే కాలనీల్లో అప్రోచ్‌రోడ్లు, అంతర్గత రోడ్లుకు రూ.96 కోట్లు వెచ్చించారు. భూగర్భజలాల పెంపునకు ఆయా కాలనీల్లో ఏకంగా 7,000 ఇంకుడు గుంతలను నిర్మిస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.420 లక్షలు ఖర్చు చేస్తోంది.

జిల్లాకు 64 వేల ఇళ్ల మంజూరు..

'నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు' పథకం కింద శ్రీ సత్యసాయి జిల్లాలో 64,029 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో లబ్ధిదారుల సొంత స్థలాల్లో 32,916 ఇళ్లు, వివిధ లేఅవుట్లలో 31,113 ఇళ్లు నిర్మిస్తున్నారు. ప్రస్తుతానికి జిల్లాలో 59,606 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఇందులో 17,552 ఇళ్లు పూర్తయ్యాయి. ఇక పైకప్పు స్థాయిలో 2,687, తీరు మట్టం స్థాయిలో 4,087 ఇళ్లు ఉన్నాయి. పునాది పైస్థాయిలో 16,050, పునాది స్థాయిలో మరో 19,239 ఇళ్లు ఉన్నాయి. మరో 4,423 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కావాల్సి ఉంది. లబ్ధిదారులకు ఇప్పటి వరకు ఇళ్ల ముడి సరకుతో కలిసి ప్రభుత్వం రూ.522.40 కోట్లు నేరుగా ఖాతాల్లో జమ చేసింది.



మణేసముద్రంలోని జగనన్న కాలనీ

సంతోషంగా ఉంది



నాకు లేపాక్షిలోని జగనన్న కాలనీలో ఇల్లు మంజూరైంది. ప్రస్తుతం నిర్మాణ పనులు చేపడుతున్నాం. ఎప్పటికప్పుడు బిల్లులు అందుతున్నాయి. ఇంటి పట్టా ఇవ్వడమే కాకుండా ఆ స్థలాన్ని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామన్నారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వమూ ఇలా చేయలేదు. ముఖ్యమంత్రి జగనన్న మా ఇంటిపై శాశ్వత హక్కు కల్పిస్తుండటం సంతోషంగా ఉంది.

– జయమ్మ, లేపాక్షి

స్ట్రాంగ్ రూంల వద్ద భద్రత పెంచాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



గోరంట్లలో స్ట్రాంగ్ రూం వద్ద అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

గోరంట్ల/లేపాక్షి: ఈవీఎంలు భద్ర పరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద భద్రత మరింత పెంచాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన గోరంట్ల న్యూ మాంటిస్సోరీ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలతో పాటు కౌంటింగ్ కేంద్రాలను, లేపాక్షి మండలంలోని నాయనిపల్లి క్రాస్ సమీపంలో ఉన్న బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేయనున్న కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. భద్రతపరంగా తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు తెలిపారు. అలాగే కౌంటింగ్ కేంద్రాల కోసం గుర్తించిన భవనాల వద్ద కల్పించాల్సిన వసతులపై సూచనలు, సలహాలు ఇచ్చారు. మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు తదితర వసతులపై అధికారులతో ఆరా తీశారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ అపూర్వభరత్, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి ఆర్డీఓలు భాగ్యరేఖ, రమేష్‌రెడ్డి, వంశీకృష్ణ, గోరంట్ల తహసీల్దార్ రంగనాయకులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

క్వింటా మిర్చి రూ.20 వేలు



హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి రాసులతో కళకళలాడుతోంది. మంగళవారం మార్కెట్‌కు 220 క్వింటాళ్లు సరకు రాగా, అధికారులు ఈ– నామ్ ద్వారా వేలం పాటలు నిర్వహించారు. ఇందులో క్వింటా (ప్రథమ శ్రేణి రకం) గరిష్టంగా రూ. 20,000, కనిష్టంగా రూ.8,800, సగటున రూ.14,000 ప్రకారం ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు.

హైకమాండ్ నిర్ణయం శిరోధార్యం

- ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించి తీసుకువస్తాం
- తుది శ్వాస ఉన్నంత వరకు జగన్ వెంటే ఉంటా
- మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: ''పార్టీ హైకమాండ్ నిర్ణయమే శిరోధార్యం. ఏం నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటాం. రానున్న ఎన్నికల్లో టికెట్ ఎవరికి ఇచ్చినా తప్పక గెలిపిస్తాం. నా తుదిశ్వాస ఉన్నంత వరకూ వైఎస్ జగన్‌వెంటే. ఇందులో మరోమాట లేదు..జగన్‌ను మరోసారి సీఎం చేయడమే మా లక్ష్యం'' అని మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగిస్తుందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం ఖాయమన్నారు. తనకు పార్టీ ఏ పని అప్పగించినా కష్టపడి పనిచేస్తానని, నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటానని వెల్లడించారు.

అభివృద్ధికి పెద్దపీట వేశాం

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంలో నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగనంత అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే తెలిపారు. మడకశిర బైపాస్ కెనాల్‌కు ఏకంగా రూ.214.85 కోట్లు మంజూరు చేయించుకోగలిగామన్నారు. రూ.20 కోట్లతో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటవుతోందని, అలాగే లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి విద్యుత్ సబ్‌స్టేషన్లను మంజూరు చేయించామన్నారు. అందువల్లే జనమంతా ఇప్పుడు వైఎస్సార్ సీపీకి మద్దతు పలుకుతున్నారని, దీన్ని ఓర్వలేని టీడీపీ నేతలు అవాకులు, చవాకులు పేలుతున్నారన్నారు. వారంతా నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. మరోసారి వైఎస్ జగన్‌పై నోరుజారితే బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, మండల కన్వీనర్ రామిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ జయరామప్ప, డైరెక్టర్లు నాగన్న, వేణు, జేసీఎస్ కన్వీనర్లు శ్రీనివాసరెడ్డి, నాగేంద్ర, శివకుమార్, నాగేంద్రయాదవ్, విక్రమ్, ఎంపీపీ రాధమ్మ, సింగిల్ విండో అధ్యక్షులు మోతిరామ్, చిక్కన్న, చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బూత్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీలు మూర్తి, శ్రీరామరెడ్డి, కౌన్సిలర్లు నాగేంద్ర, రమేష్, అంజన్, శ్రీనివాస్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో నిఘా పెంచండి



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

- గంజాయి, సారా రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపండి
- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ మాధవరెడ్డి



సమావేశానికి హాజరైన పోలీసు అధికారులు

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దులో నిఘా పెంచాలని, ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఎస్పీ మాధవరెడ్డి పోలీసు అధికారులు ఆదేశించారు. అలాగే గంజాయి, సారా అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. మంగళవారం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోలీస్‌స్టేషన్లలో నమోదైన గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులు వివరాలు తెలుసుకొని నేరాలు, శిక్షలు, కోర్టు కేసుల పురోగతిపై పలు సూచనలు సలహాలు చేశారు. అనంతరం ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓపెన్ డ్రింకింగ్, డ్రంకన్ డ్రైవ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాల్లో వాహనదారులను అప్రమత్తం చేస్తూ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కోర్టుల్లో విచారణలో ఉన్న కేసులపై దృష్టి సారించాలన్నారు. సాక్షులు నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా చూడాలన్నారు. రౌడీషీటర్లు, ట్రబుల్‌మాంగర్లకు క్రమం తప్పకుండా కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. లాడ్జిలు, హోటళ్లపై ప్రత్యేక నిఘా ఉండే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మట్కా, ఎర్రచందనం కేసులను ప్రాధాన్యతగా గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన కార్యక్రమంలో స్వీకరించిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. అంతిమంగా ప్రతి పోలీసు అధికారి ప్రజలకు నమ్మకం కలిగేలా విధులు నిర్వర్తించాలన్నారు. సమీక్షలో అడిషనల్ ఎస్పీ విష్ణు, డీఎస్పీలు వాసుదేవన్, కంజాక్షన్, హుస్సేన్ పీరా, శ్రీలత, సీఐలు రవీంద్రారెడ్డి, శ్రీహర్ష, లీగల్ అడ్వయిజర్ సాయినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు 'ఆడుదాం ఆంధ్రా'

- నేటి నుంచి జిల్లా స్థాయి పోటీలు
- వివిధ క్రీడాంశాల్లో 684 మంది పోటీ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



జిల్లా స్థాయి పోటీల కోసం మైదానాన్ని పరిశీలిస్తున్న డీఎస్ఓ, పీడీలు



నియోజకవర్గ స్థాయి పోటీల్లో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

పుట్టపర్తి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోన్న 'ఆడుదాం..ఆంధ్రా' క్రీడా పోటీలు తుది దశకు చేరుకున్నాయి. 2023 డిసెంబర్ 15న జిల్లాలో ప్రారంభమైన పోటీలు మండల, నియోజకవర్గ స్థాయిలో ముగిశాయి. క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 31వ తేదీ (బుధవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. వివిధ క్రీడాంశాల్లో 684 మంది క్రీడాకారులు పోటీ పడనున్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు.

రికార్డు స్థాయిలో క్రీడాకారులు హాజరు

దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సంరంభానికి శ్రీకారం చుట్టారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ ఇలా మొత్తం 5 క్రీడాంశాల్లో గ్రామ సచివాలయ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి వరకూ పోటీలు నిర్వహించారు. ఆయా మండలాల్లోని 502 క్రీడా మైదానాల్లో పోటీలు నిర్విరామంగా జరిగాయి. వివిధ క్రీడాంశాల నిర్వహణకు ప్రభుత్వం 5,440 మంది వలంటీర్లు, 2,160 మంది అంపైర్లు, 350 మంది పీడీలు, పీఈటీలను నియమించింది. అలాగే జిల్లాలో రిజిస్ట్రేషన్ చేసుకున్న 62,016 మందికి ప్రభుత్వం టీ షర్టులు, టోపీ, ఇతర క్రీడా సామగ్రిని అందజేసింది.

రెండు ప్రాంతాల్లో జిల్లా స్థాయి పోటీలు

జిల్లా స్థాయి పోటీలు పుట్టపర్తి, పెనుకొండలలో జరగనున్నాయి. బుధవారం ఉదయం 8 గంటలకు పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న మైదానంలో పురుషుల వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు ఉంటాయని అధికారులు తెలిపారు. అదేవిధంగా పురుషుల, మహిళల షటిల్, బ్యాడ్మింటన్ పోటీలు పెనుకొండలోని క్రీడా వికాస కేంద్రం డిగ్రీ కళాశాల వెనుకవైపు ఉన్న మైదానంలో నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.

బ్యాడ్మింటన్ డబుల్స్ విజేతలకు బహుమతులు ఇలా..

స్థానం	నియోజకవర్గస్థాయి	జిల్లాస్థాయిలో	రాష్ట్రస్థాయిలో
ప్రథమ	రూ.20 వేలు	రూ.35 వేలు	రూ.2 లక్షలు
ద్వితీయ	రూ.10 వేలు	రూ.20 వేలు	రూ.లక్ష
తృతీయ	రూ.5 వేలు	రూ.10 వేలు	రూ.50 వేలు

క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విజేతలకు ఇలా..

స్థానం	నియోజకవర్గస్థాయి	జిల్లాస్థాయిలో	రాష్ట్రస్థాయిలో
ప్రథమ	రూ.35 వేలు	రూ.60 వేలు	రూ.5 లక్షలు
ద్వితీయ	రూ.15 వేలు	రూ.30 వేలు	రూ.3 లక్షలు
తృతీయ	రూ.5 వేలు	రూ.10 వేలు	రూ.2 లక్షలు

గ్రామీణ యువతకు గొప్ప వరం



'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు గొప్ప వరంగా మారాయి. ఇప్పటికే గ్రామీణ, మండల, నియోజకవర్గ స్థాయిలో పోటీలు పూర్తయ్యాయి. మాలాంటి ఎందరో క్రీడాకారులకు ఈ వేదిక ఎంతగానో ఉపయోగపడింది. మా ప్రతిభ పది మందికీ తెలిసింది.

– వెంకట్, జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారుడు, బుక్కపట్నం

ఏర్పాట్లు పూర్తి చేశాం



గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి 'ఆడుదాం ఆంధ్రా' పోటీలను సమర్థవంతంగా నిర్వహించాం. జిల్లా స్థాయి పోటీలను అదే పద్ధతిలోనే నిర్వహిస్తాం. వివిధ క్రీడాంశాలకు సంబంధించి 684 మంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి పోటీలు పుట్టపర్తి, పెనుకొండ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నాం. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లోని మైదానాల్లో ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తి చేశాం.

– ఉదయ్ భాస్కర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి

క్లుప్తంగా

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

• డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణారెడ్డి



సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణారెడ్డి

రొళ్ల: గ్రామీణులకు నాణ్యమైన వైద్యసేవలు చేరువ చేయడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు. రొళ్ల మండలం ఎం.రాయాపురంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణితో కలసి డాక్టర్ కృష్ణారెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. ప్రజారోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షా వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా గ్రామీణుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కాగా, వైద్య శిబిరంలో 443 మందికి ప్రత్యేక వైద్య నిపుణులు చిదానంద, శ్రీకాంత్, కాశీవిశ్వనాథ్, అనిత్ తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించి, చికిత్స అందజేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆజాద్, ఈఓఆర్డీ కృష్ణప్ప, పీహెచ్ఎన్ సుధారాణి, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వారి చేతిలో పండు భద్రం



అనంతపురం సమీపంలోని అయ్యవారిపల్లి వద్ద ఢిల్లీ దోస కాయలను ప్యాక్ చేస్తున్న కాలువపల్లి కూలీలు

• ఢిల్లీ దోస ప్యాకింగ్‌లో కాలువపల్లి వాసులది అందెవేసిన చేయి
• ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ సేవలు

సాక్షి, అనంతపురం డెస్క్ : 'ఢిల్లీ దోస' .. ఈ పంట ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో బాగానే సాగవుతోంది. పసుపు పచ్చ రంగులో నిగనిగలాడే కోహినూరు రకం దోసకాయలకు ఢిల్లీ ప్రాంతంలో మంచి డిమాండ్ ఉంది. దీంతో ఇవి 'ఢిల్లీ దోస'గా స్థిరపడ్డాయి. ఈ పంటను ఉమ్మడి జిల్లా రైతులే కాకుండా.. కర్నూలు, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో సైతం సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.70 వేలు పెట్టుబడి పెడితే.. నికరాదాయం రూ.1.10 లక్షల నుంచి రూ.1.40 లక్షల వరకు వస్తుంది. ఈ పంట సాగు ఒక ఎత్తయితే..దోసకాయలను మార్కెట్టుకు తరలించడం మరోఎత్తు. కాయ నాణ్యత ఏమాత్రమూ దెబ్బతినకుండా జాగ్రత్తగా ప్యాక్ చేసి తరలించాల్సి ఉంటుంది. ప్యాకింగ్‌ను బట్టే కాయనాణ్యత, ధర ఆధారపడి ఉంటాయి. దీంతో రైతులు, వ్యాపారులు ప్యాకింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపుతుంటారు. ఈ పని సాధారణ కూలీలు చేయలేరు. నిష్ణాతులైన వారు చేస్తేనే దోసకాయకు భద్రత ఉంటుంది.

ప్యాకింగ్‌లో కింగ్‌లు..కాలువపల్లి వాసులు

ఢిల్లీ దోసకాయల పంట కోత, ప్యాకింగ్‌లో బెళుగుప్ప మండలం కాలువపల్లి వాసులు నైపుణ్యం సాధించారు. గ్రామంలో సుమారు రెండు వేల జనాభా ఉండగా..300 మంది దాకా కూలీలు ఈ పనిలో రాటుదేలారు. వీరిని చూసి పక్కనే ఉండే కళ్యాణదుర్గం మండలం మానిరేవు గ్రామానికి చెందిన కొందరు కూలీలు కూడా ఈ మార్గాన్నే ఎంపిక చేసుకుని ఉపాధి పొందుతున్నారు. ఢిల్లీ మార్కెట్లో కూడా 'కాలువపల్లి' ప్యాకింగ్ అంటేనే వ్యాపారులకు ఓ నమ్మకం ఏర్పడింది. దీంతో ఈ గ్రామ కూలీలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. పంట కోతలు, ప్యాకింగ్ కోసం రైతులు వీరి వద్దకు క్యూకట్టే పరిస్థితి. ఒక్కో లారీకి రెండు వేల బాక్సులు నింపాల్సి ఉంటుంది. 20 మంది కూలీలు సులువుగా ఈ పని పూర్తిచేస్తారు.

కొందరితో మొదలై...

పదేళ్ల క్రితం ఢిల్లీ నుంచి వచ్చిన ఏజెంట్ల ద్వారా దోసకాయల కోతలు, ప్యాకింగ్‌లో మెలకువలను కాలువపల్లికి చెందిన కొందరు కూలీలు తెలుసుకున్నారు. ఏ దశలో కోత చేస్తే ఢిల్లీ మార్కెట్టుకు వెళ్లే వరకు కాయలు సురక్షితంగా ఉంటాయి, సైజుల వారీగా బాక్సులను ఎలా నింపాలి? ఒక లారీకి ఎన్ని బాక్సులను లోడ్ చేయాలి? ఎన్ని ఎకరాల దిగుబడి ఒక లారీకి సరిపోతుందన్న అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన తెచ్చుకున్నారు. వీరికి పనులు బాగా దొరకడంతో గ్రామంలో చాలామంది ఇదే బాటలో నడిచారు. ఇప్పుడు పక్క గ్రామాల కూలీలు సైతం వీరిని అనుసరిస్తున్నారు.

ఉపాధికి ఢోకా లేదు

దోసకాయల ప్యాకింగ్ నిపుణులుగా మారిన తర్వాత కాలువపల్లి కూలీల ఉపాధికి ఢోకా లేకుండా పోయింది. ఏడాదిలో మూడు నెలలు మినహా మిగిలిన రోజుల్లో నిరంతరం పనులు ఉంటాయి. దీంతో మంచి ఆదాయం పొందుతున్నారు. ఆర్థికంగా ఎదుగుతున్నారు. పిల్లలను కూడా బాగా చదివించుకుంటున్నారు.

ఏజెంట్ల ద్వారా కబురు



తెలుగు రాష్ట్రాలు, కర్ణాటకలో ఎక్కడ పంట కోత ఉన్నా కాలువపల్లి కూలీలకు సమాచారం అందుతుంది. గ్రామంలోనే ముగ్గురు ఏజెంట్లు ఉన్నారు. మానిరేవులో కూడా ఒకరిద్దరు ఏజెంట్లు ఉన్నారు. వీరికి వివిధ ప్రాంతాల్లోని లారీ అసోసియేషన్లు, వ్యాపారులు, బడా రైతులతో సంబంధాలు ఉన్నాయి. దీంతో పంట కోతల సమాచారాన్ని వీరికి చేరవేస్తారు. వీరు ఒక మేస్త్రీ ఆధ్వర్యంలో కొందరు కూలీలను జతచేసి పంపుతుంటారు. రవాణా, భోజన ఖర్చులన్నీ రైతులు లేదా వ్యాపారులే భరిస్తారు. ఒక్కొక్కరికి రోజుకు రూ.600 నుంచి రూ.వెయ్యి దాకా కూలి లభిస్తుంది.

పనులు వెతుక్కోవాల్సిన అవసరం లేదు



నాతో పాటు గ్రామంలో చాలామంది దోస కాయల ప్యాకింగ్‌కు వెళ్తున్నాం. ఎక్కడ పనులు ఉంటే అక్కడికి వెళ్లి చేస్తున్నాం. ఏజెంట్లు గ్రామంలోనే ఉండటంతో ఇబ్బందులు లేకుండా పనుల గురించి ముందస్తుగానే సమాచారం అందుతోంది. కూలి పనులు వెతుక్కోవాల్సిన అవసరం లేకుండా పోయింది.

– అభిలాష్‌రెడ్డి, కాలువపల్లి

చేతినిండా పని ఉంటోంది



దోసకాయల కటింగ్, ప్యాకింగ్‌లో మాకు మంచి గుర్తింపు వచ్చింది. ఒక్కో బాక్సులో కాయ సైజును బట్టి 5 నుంచి 11 వరకు ప్యాక్ చేస్తాం. ఇందులో పాటించే మెలకువల వల్ల కాయ సురక్షితంగా మార్కెట్టుకు చేరుతుంది. ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల రైతులు కూడా మమ్మల్ని సంప్రదిస్తున్నారు. దీంతో చేతినిండా పని ఉంటోంది.

– సోమశేఖర్, మేస్త్రీ, కాలువపల్లి

మంచి ఆదాయం పొందుతున్నా



ఢిల్లీ ఏజెంట్ల ద్వారా ప్యాకింగ్ నేర్చుకున్నా. నిత్యం పని దొరుకుతోంది. ఒక లారీ కాయలు లోడ్ చేస్తే ఒక్కొక్కరికి రూ.600కు పైగానే కూలి లభిస్తోంది.

– రంజాన్, కాలువపల్లి

కుటుంబానికి తోడ్పాటు



మాది వ్యవసాయ కుటుంబం. అయినా నేను ప్యాకింగ్ పనులకు వెళ్తుంటా. తద్వారా వచ్చే ఆదాయంతో మరింత తోడ్పాటు లభిస్తోంది. తొలుత కొందరు సీనియర్లతో కలసి పనులకు వెళ్లి వారి సలహాలు, సూచనలతో మెలకువలు నేర్చుకున్నా. ఇందులో ఎంత పని చేస్తే అంత ఆదాయం ఉంటోంది.

– నరేష్, కాలువపల్లి

బహిరంగ ప్రదేశాల్లో . దూమపానం నిషేధం : ఎస్పీ



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి, వైద్యసిబ్బంది

పుట్టపర్తి టౌన్: బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్పీ మాధవరెడ్డి హెచ్చరించారు. పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై వైద్య ఆరోగ్య శాఖ ముద్రించిన పోస్టర్లను మంగళవారం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో ఆయన విడుదల చేసి మాట్లాడారు. బహిరంగ ప్రదేశాలతో పాటు విద్యాసంస్థలు వద్ద ధూమపానాన్ని నిషేధిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. 18 సంవత్సరాలలోపు వారికి పొగాకు ఉత్పత్తులు విక్రయించడమూ చట్టరీత్యా నేరమన్నారు. జిల్లాలో పొగాకు నిషేధిత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు అడిషనల్ ఎస్పీ విష్ణు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

సూక్ష్మసేద్య పరికరాల పరిశీలన



బుక్కపట్నంలో సూక్ష్మసేద్యం పరికరాలను పరిశీలిస్తున్న పీడీ సుదర్శన్

పుట్టపర్తి అర్బన్: రెండో విడతలో రైతులకు అందజేసిన సూక్ష్మ సేద్య పరికరాలను మంగళవారం ఏపీ ఎంఐపీ పీడీ సుదర్శన్ పరిశీలించారు. బుక్కపట్నం, కర్ణాటక నాగేపల్లి, జగరాజుపల్లి, తదితర గ్రామాల్లో పర్యటించిన ఆయన... నేరుగా పొలాల్లోకి వెళ్లారు. రైతులు సాగు చేసిన ఉద్యాన పంటలు, ఏర్పాటు చేసిన పరికరాలను పరిశీలించారు. బిందు, తుంపర సేద్య పరికరాలను ఎలా వినియోగించాలన్న దానిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు సూక్ష్మ సేద్య పరికరాలు ఎంతో ఉపయోగకరమన్నారు. తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తోడల్లుడిపై హత్య కేసు నమోదు

కళ్యాణదుర్గం: దంపతుల మధ్య వివాదాన్ని సర్దిచెప్పేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై కత్తితో దాడి చేసి, ఆయన మృతికి కారణమైన తోడల్లుడిపై పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. వివరాలు... కళ్యాణదుర్గం మండలం తూర్పు కోడిపల్లికి చెందిన రాజన్న (42), సుకన్య దంపతులు. ఈ నెల 28న భర్త రాజన్నతో కలసి కళ్యాణదుర్గంలోని జయనగర్‌లో నివాసముంటున్న చెల్లెలు సరస్వతి ఇంటికి సుకన్య వచ్చారు. ఆ సమయంలో సరస్వతి, ఆమె భర్త సురేంద్ర ఘర్షణ పడుతుండడంతో రాజన్న సర్దిచెప్పబోయాడు. దీంతో ఆగ్రహానికి గురైన సురేంద్ర కత్తితో రాజన్నపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన రాజన్నను వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సోమవారం రాత్రి బెంగళూరుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో ఆయన మృతి చెందాడు. దీంతో సురేంద్రపై పోలీసులు హత్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



ఆదినారాయణ (ఫైల్)

రాప్తాడు: కారు ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహన చోదకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బీఎస్పీ జిల్లా మాజీ అధ్యక్షుడు, రాప్తాడు మండలం బొమ్మేపర్తికి చెందిన ఆసాది ఆదినారాయణ (61), నాగలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరికీ పెళ్లిళ్లు చేశారు. ప్రస్తుతం అనంతపురంలోని హమాలీ కాలనీలో నివాసముంటున్న ఆదినారాయణ మంగళవారం ఉదయం చిన్న కుమార్తెను చూసేందుకు బొమ్మేపర్తికి వచ్చాడు. అల్లుడు నాగరాజు, ఆయన కుటుంబసభ్యులతో కాసేపు గడిపి తన టీవీఎస్ మోపెడ్‌పై తిరుగు ప్రయాణమయ్యాడు. లింగనపల్లి క్రాస్ వద్ద 44వ జాతీయ రహదారిపైకి చేరుకోగానే బెంగళూరు నుంచి అనంతపురం వైపు వేగంగా వెళుతున్న కారు ఢీకొంది. దీంతో ఆసాది ఆదినారాయణ రోడ్డు పక్కనే ఉన్న గుంతలోకి పడ్డాడు. తల నేరుగా బండరాయిని తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి దుర్మరణం



మృతుడు మసూద్‌వలి

తాడిపత్రి అర్బన్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... నార్పల గ్రామానికి చెందిన షేక్ మసూద్‌వలి(58)కి భార్య, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న ఆయన మంగళవారం తాడిపత్రికి వచ్చాడు. నందలపాడులోని బంధువులను పలకరించి తన స్కూటీ వాహనంపై చుక్కలూరు వైపు బయలుదేరాడు. శ్రీనివాసపురంలోని శ్రీకృష్ణదేవరాలయ విగ్రహం సమీపంలో వాహన వేగాన్ని నియంత్రించుకోలేక రోడ్డు పక్కన ఉన్న సైడ్ కాలువలోకి దూసుకెళ్లాడు. ఘటనలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమార్తె చాందిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

నల్లచెరువు: మండలంలోని బంద్రేపల్లికి చెందిన అమరనాథరెడ్డి(38) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... బంద్రేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, రైతు ఆదినారాయణరెడ్డి కుమారుడు అమరనాథరెడ్డి ఎంబీఏ పూర్తి చేసి బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసేవారు. ఆయనకు భార్య జ్యోత్స్న, ఇద్దరు పిల్లలున్నారు. మద్యానికి బానిసైన ఆయన ఏడాది క్రితం తన ఉద్యోగాన్ని మానేసి స్వగ్రామానికి చేరుకున్నాడు. అప్పటి నుంచి ఇంటి వద్దనే ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన సోమవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో పైకప్పుకు ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కాపాడి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అమరనాథరెడ్డి మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు. కాగా, అమరనాథరెడ్డి మృతి విషయం తెలుసుకున్న కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్ధారెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్ అహమ్మద్... కదిరి ఏరియా ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అమరనాథరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి వెంట సింగిల్‌విండో అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

171 మంది వీఏహెచ్‌ఏల బదిలీ

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖలో విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న 171 మంది బదిలీ అయ్యారు. మంగళవారం అనంతపురంలోని పశుశాఖ కార్యాలయంలో రెండు జిల్లాల జేడీలు డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, డాక్టర్ బి.శుభదాస్, నలుగురు డీడీల సమక్షంలో వీఏహెచ్‌ఏల బదిలీల ప్రక్రియ నిర్వహించారు. మూడేళ్ల క్రితం నియమితులైన 219 మంది ఉమ్మడి జిల్లా పరిధిలో ఆర్‌బీకే అసిస్టెంట్లుగా పనిచేస్తున్నారు. తాజాగా 445 మంది వీఏహెచ్‌ఏలుగా నియమితులయ్యే అవకాశముంది. ఈ క్రమంలో ఇప్పటి వరకూ పనిచేస్తున్న వారికి బదిలీ అవకాశం కల్పించారు. దీంతో రెండు జిల్లాల పరిధిలో దరఖాస్తు చేసుకున్న 171 మందిని బదిలీ చేశారు. వీరందరికీ బుధవారం బదిలీ ఉత్తర్వులు ఇవ్వనున్నారు. అనంతరం ఖాళీలను బట్టి రెండు, మూడు రోజుల్లో కొత్తవారికి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

రైతు రుణాలకు ప్రాధాన్యత

• డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: రైతు రుణాలకు అత్యంత ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలని డీసీసీబీ సిబ్బందిని ఆ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎం.లిఖిత ఆదేశించారు. మంగళవారం అనంతపురంలోని మొదటి రోడ్డులో ఉన్న బ్రాంచ్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. రైతులకు అందిస్తున్న వివిధ రకాల రుణాలు, రికవరీ, డిపాజిట్లు తదితర వివరాలను బ్రాంచ్ మేనేజర్ సుజాతను అడిగి తెలుసుకున్నారు. ఖాతాదారులకు అందిస్తున్న ఆధునిక బ్యాంకింగ్ సేవలు, టర్నోవర్‌పై ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం, నాబార్డు, ఆప్కాబ్ అందిస్తున్న ప్రోత్సాహంతో బ్యాంకు పురోభివృద్ధికి అధికారులు, సిబ్బంది సమన్వయంతో బాధ్యతగా పనిచేయాలన్నారు. స్వల్పకాలిక పంట రుణాలతో పాటు రైతులకు దీర్ఘకాలిక రుణాలు (టర్మ్‌లోన్లు) విరివిగా ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో సహాయక మేనేజర్లు శిరీష, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

వీరాపురంలో 'సైబీరియన్' సందడి



తుమ్మలకుంట చెరువులో సందడి చేస్తున్న సైబీరియన్ కొంగలు

చిలమత్తూరు: మండలంలోని వీరాపురం, వెంకటాపురం గ్రామాలకు సైబీరియన్ పక్షులు చేరుకున్నాయి. ఏటా సైబీరియా నుంచి 5 వేల కి.మీ ప్రయాణించి సంతానోత్పత్తి కోసం వీరాపురానికి పక్షులు చేరుకుంటుండడం విశేషం. ఈ క్రమంలో మంగళవారం సైబీరియన్ పక్షులు వీరాపురానికి చేరుకోవడంతో గ్రామంలో సందడి నెలకొంది. ఆరు నుంచి ఏడు నెలల పాటు ఇక్కడే ఉంటాయి.

ప్రాణాలు బలిగొన్న వివాహేతర సంబంధం

• అనంతపురం శివారులో యువకుడి దారుణ హత్య
• హతుడి శరీరంపై 15 కత్తిపోట్లు



ఘటనా స్థలంలో రాజేష్ నాయక్ మృతదేహం

రాప్తాడు రూరల్: వివాహేతర సంబంధం ఓ యువకుడి ప్రాణాలు బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం జంబులదిన్నె కొట్టాల నివాసి రాజేష్ నాయక్ (32), రుద్రంపేట పంచాయతీ పరిధిలోని చంద్రబాబు కొట్టాలుకు చెందిన ఎస్.ఆంజనేయులు స్నేహితులు. ఇద్దరికీ వివాహమైంది. ఇద్దరూ చంద్రబాబు కొట్టాలులోనే స్థిర నివాసం ఏర్పరుచుకుని ఆటో డ్రైవర్లుగా జీవనం సాగించేవారు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం రాజేష్ నాయక్‌ను వదిలి భార్య వెళ్లిపోయింది. అనంతరం రాజేష్ నాయక్ ఆటో డ్రైవింగ్ వదిలేసి జిలేబి మాస్టర్‌గా పనిచేస్తూ తరచూ ఆంజనేయులు ఇంటికి రాకపోకలు సాగించసాగాడు. ఈ నేపథ్యంలోనే ఆంజనేయులు భార్యతో సాన్నిహిత్యం పెరిగింది. వీరిద్దరి వ్యవహారంపై అనుమానం పెంచుకున్న ఆంజనేయులు ఎలాగైనా రాజేష్ నాయక్‌ను కడతేర్చాలని అనుకున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఇద్దరూ కలిశారు. బైకులో తిరుగుతూ పూటుగా మద్యం తాగారు. అప్పటికే పక్కా ప్రణాళికతో ఉన్న ఆంజనేయులు సరైన ప్రాంతం కోసం పలుచోట్ల తిప్పాడు. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీ నందమూరి నగర్ వెనుక ఉన్న సీవీరామన్ జూనియర్ కళాశాల నుంచి కట్టకిందపల్లికి వెళ్లే మార్గంలో నిర్జన ప్రదేశానికి చేరుకోగానే రాజేష్ నాయక్‌పై కత్తితో దాడి చేశాడు. పొట్ట, ఛాతి భాగాల్లో దాదాపు 15 సార్లు కత్తితో బలంగా పొడవడంతో రాజేష్ నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం అక్కడి నుంచి ఆంజనేయులు ఉడాయించాడు. మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు రాజేష్ నాయక్ మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. హతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందజేసి, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఈసీ నిబంధలన్నీ పాటించాలి

• ఎన్నికల విధులపై అందరూ అవగాహన కలిగి ఉండాలి
• పోలీసు సిబ్బందితో విశ్రాంత ఆర్డీఓ విశ్వనాథ్
• ఎన్నికల కోడ్ పక్కాగా పాటించాలి: ఎస్పీ మాధవరెడ్డి




మాట్లాడుతున్న విశ్రాంత ఆర్డీఓ విశ్వనాథ్

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికల విధులపై ప్రతి పోలీసు అధికారీ అవగాహన కలిగి ఉండాలని విశ్రాంత ఆర్డీఓ విశ్వనాథ్, ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. మంగళవారం పుట్టపర్తి పట్టణంలోని సాయి ఆరామంలో పోలీస్ సిబ్బందికి ఎన్నికల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత ఆర్డీఓ విశ్వనాథ్, ఎస్పీ ముఖ్య అతిథులుగా హాజరై సిబ్బందికి అవగాహన కల్పించారు. తొలుత విశ్రాంత ఆర్డీఓ విశ్వనాథ్ మాట్లాడుతూ, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది ఎన్నికల కమిషన్ నియమ నిబంధలన్నీ పాటించాలన్నారు. ఎస్‌డీసీఓలు, ఎస్‌హెచ్‌ఓలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించి స్థానికులతో సమావేశమై ఎన్నికల నిబంధనలన్నీ వివరించాలన్నారు. ఎన్నికల విధుల్లో ఉండే అధికారులెవరూ పక్షపాతంగా వ్యవహరించకూడదని, అలాంటి వారిపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుందన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు.

కోడ్ ఉల్లంఘించకూడదు

అనంతరం ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా పనిచేయాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేవిధంగా చూసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కోడ్‌పై అవగాహన కలిగి ఉండాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ ఎన్నికల కోడ్ ఉల్లంఘించడానికి వీల్లేదన్నారు. ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టుల ఏర్పాటుకు అవసరమైన ప్రాంతాలు గుర్తించాలన్నారు. లైసెన్స్ ఆయుధాలను సంబంధిత పోలీస్ స్టేషన్‌లో భద్రపరచాలన్నారు, శాంతిభద్రతలకు భంగం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించకూడదన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ విష్ణుతోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

నీటిలో పడి వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గుంతకల్లు రూరల్: ప్రమాదవశాత్తు నీటిలో పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు – గుత్తి మార్గంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న గొల్లలదొడ్డినుంచి వైటీ చెరువుకు వెళ్లేదారిలో ఉన్న కాలువలో ఓ గుర్తు తెలియని పురుషుడి మృతదేహాన్ని మంగళవారం ఉదయం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న గుంతకల్లు రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. 45 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తి మల విసర్జనకు వెళ్లి మద్యం మత్తులో నీటిలో జారి పడి మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమ య్యాయి. మృతుడి జేబులో కర్ణాటకకు చెందిన గోల్డెన్ బీడీల కట్ట ఉంది. నీలం రంగు టీషర్ట్, తెల్లని చెక్స్ కలిగిన ప్యాంటు ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు 93469 17089, 94407 96824కు సమాచారం అందించాలని రూరల్ ఎస్ఐ సురేష్ కోరారు.